ఏకాంతసేవ

కప్పగంతుల మల్లికార్జునరావు

టీవీ చూచి చూచి కళ్ళు గుంటలు పడ్డాయి సుధాంశుకు. మనసు మొద్దుబారింది.

పత్రికలు, పుస్తకాలు బల్లమీద చాలా వున్నాయి. కానీ వాటిని తాకాలంటే భయం వేస్తోంది. వార్తలన్నీ వక్రదంతాలు– బొమ్మలన్నీ అస్తిపంజరాలు–కథలు రక్తసిక్తాలు– నవలలు కామశాస్త్రాలుగా కన్పిస్తున్నాయి.

'అమ్మో. వద్దు వద్దు' అనుకొంది సుధాంశు.

యీ పుస్తకాలు, పత్రికలు, టీవీ రేడియో ప్రోగ్రామ్ల నుంచి విముక్తి కావాలి. మనసుకు రిలీఫ్ కావాలి.

కానీ ఎలా? ఏదీ మార్గం?

ఆమె కిటికీలో నుంచి క్రిందికి చూచింది.

జనం....జనం.... పరుగులెత్తే జనం

వెర్రెత్తిన వాహనాలు.....

మనసులో మాట చెప్పుకోటానికి మనుష్యులే కరువవుతే ఎలా?

సుధాంశు అసలు సిసలు కోనసీమ గ్రామంలో పుట్టింది.

ఎటుచూచినా ఏపుగా ఎదిగిన కొబ్బరి చెట్లు..... పిల్ల కాలువలు..... పచ్చటి పైర్లు......

ఇరవై సంవత్సరాలు ఆ వాతావరణంలో పెరిగిన ఆమెకు వైవిధ్యం కావాలని పించింది. యింతలో తండ్రి ఆమెకు పెళ్ళి సంబంధాలు చూడసాగేడు.

ఆయన ధనవంతుడు. పైగా యిద్దరు కొడుకుల తర్వాత పుట్టిన ఏకైక పుత్రిక. గారాబాల పట్టి.

చుట్టుపక్కల గ్రామాలలో, బస్తీలలో వారి సంబంధాలు బోలెడన్ని వచ్చాయి. ఆస్తిపాస్తులకి లోటు లేదు. అందాలు సర్దుకోవచ్చు. కానీ వైవిధ్యం?

నాలుగైదు సంబంధాలు తిరగగొట్టింది.

తండ్రికి మతిపోయింది.

'నాన్నా, జీవితమంటే పిల్లకాలువలు..... కొబ్బరి చెట్లు.... వరి చేలేనా? ప్రపంచం చాలా పెద్దది నాన్నా. నేనింక యీగ్రామాలలో బ్రతకలేను. మహానగరాలలో శేషజీవితం 'ఎన్జాయ్' చేద్దామని వుంది' అంది తండ్రితో.

'అదేమిటే సుధా. వొక్కగానొక్క ఆడపిల్లవు. నిన్ను అంతంత దూరాలకు పంపించి మేం వుండగలమా?' తల్లి పాత్ర ప్రవేశించి రచయిత రాయని డైలాగ్ అంది.

'యిదమ్మా మీ అమ్మ వరస! వెంకటాపురం, సంకటాపురం సంబంధాలు నీకు చేయమని రాత్రిళ్ళు నన్ను నిద్ర పోనీయకుండా వొకటే అల్లరి చేస్తోంది మీ అమ్మ. అందుకే యీలాంటి సంబంధాలు తెచ్చాను. నాకసలు ఏ ఇంజనీర్లో అల్లుడు కావాలనివుంది. నా అల్లుడు , కూతురు, బొంబాయి, ఢిల్లీ, కలకత్తాలలో వున్నారని చెప్పుకోటం నాకు మాత్రం గొప్పకాదూ? యిక మీ అమ్మ మాటల్ని 'వీటో'చేసి పారేసి, నీ కోరిక, నా కోరిక తీరే సంబంధం తెస్తానుండు'

'కానీ అమ్మాయిని నేలకోసారైనా చూడందే నేనుండలేను. ఛస్తాను'

'చచ్చేవాళ్ళెవరూ ముందుగా నోటీసు యిచ్చి చావరు. నువ్వు అసలు చావవు. నువ్వు చస్తానన్నా నేను చావనివ్వను. ఆ భయం అక్కర్లేదు. అంతగా కావాలంటే వో హెలీకాప్టర్, మీ నాన్న నడిగి కొనుక్కో. వారం వారం బొంబాయో కలకత్తానో వెళ్ళి కూతుర్ని చూచుకొచ్చుకో. కావాలంటే నీకోసం నేనో త్యాగం చెయ్యగలను. ఆ విమానం నడపటం నేర్చుకొని నీ హెలీకాప్టర్కి పైలెట్ నయి నిన్ను అక్కడికీ యిక్కడికీ తిప్పుతాను. ఏం సరేనా? యిక నీ కందిరీగ వాయిద్యం ఆపు'.

'ట్రింగ్.... ట్రింగ్' ఫోను మోగింది.

'నాకు ఫోను చేసే నాథుడెవరబ్బా!' అనుకొంటూ కిటికీ దగ్గరి నుంచి కదిలింది.

ఏమో! నాథుడు–గురునాథుడే– ఫోను చేసే డేమో! హాయిగా కొంత కాలక్షేపం. ఫోను ఎత్తింది ఆశగా.

'హలో మిస్ కౌల్. రాత్రికి మన ఎంగేజ్మెంట్ గుర్తుందికదా? ఫైవ్ స్టార్లో రూమ్ బుక్ చేసేను. యీరాత్రి కొత్త రుచులు చూస్తావు. వస్తావుగా?' ఇంగ్లీషులో అవతల వో పురుషకంఠం మత్తుగా అంటోంది.

గుండె గుభేలు మంది. ఛటుక్కున ఫోను పెట్టేసింది. అమ్మో! ఫోనులో ఎన్నెన్ని ధుర్మార్గాలు జరిగిపోతుంటాయి?

అంతలోనే ఆమెకు 'బోరు' గుర్తుకొచ్చింది. చిన్న చిలిపి ఆలోచన వచ్చింది.

ఫోన్ ఎత్తి ఏవో కొన్ని నెంబర్లు తిప్పింది.

'హలో' వో ముసలి పురుషకంఠం పలికింది.

'హలో . దిస్ యీజ్ మిస్ కాల్. రాత్రికి ఫైవ్ స్టార్లో రూమ్ బుక్చేసేవా తాతయ్యా?'

'ఫైవ్ స్టార్లో , రూమా? ఎందుకు?'

'వొక పురుషుడు స్త్రీని అడగాల్సిన ప్రశ్నకాదు తాతయ్యా అది ?

జీవితం......

రసం..... రసం....

నవరసం

నీకప్పుడే నీరసం

మరిచావా మన సరసం.....?"

'యింతకీ నువ్వెవరి వమ్మాయ్? నీ ఫోన్ నెంబరెంత? సర్దాగా మాట్లాడుతున్నావా?నిజంగానే మాట్లాడుతున్నావా?'

ముసలి ముండాకొడుక్కి ఎంత ఆశ?

నిజంగా మాట్లాడుతున్నానంటే ఏమంటాడో?

'సారీ మిస్ కాల్. కాస్తంత ముసలితనం వస్తోందికదూ? పైగా ఎందరు ఆడవాళ్ళతో ఎన్నెన్ని అనుభవాలో? ఎవరెవరోగుర్తుండి చావటం లేదు. నిన్ను చూస్తే గుర్తు పట్టగలనులే. రూమ్ బుక్చేసి ఫోను చేస్తాను. నీ నెంబరు చెప్పు. లేకపోతే యిప్పుడే మాయింటికి వచ్చేయ కూడదూ? యింట్లో యిప్పుడు నేనొంటరిగానే వున్నాను'

'షటప్.....' కోపంగా అనేసి ఫోను పెట్టేసింది సుధాంశు.

'యీ మగవారు అంతా యింతే. చచ్చేముందు కూడా పరాయి ఆడది కన్పించి ప్రేమగా పలకరిస్తే లేచి కూర్చుని మీసాలు మెలేస్తారు. ఛీ ఛీ.....'

అటూ యిటూ అసహనంగా తిరుగుతుండగా ఆమెకు గురునాథం గుర్తుకొచ్చాడు.

తండ్రి ఏరికోరి తనకని తీసుకొచ్చిన భర్త అతను. పుట్టింది గ్రామంలో నే అయినా అయిదో సంవత్సరం వయస్సు వచ్చిన దగ్గరినుంచి అతను టౌన్లు, పట్టణాలు తప్ప గ్రామం మొహం చూడలేదు.

కాన్వెంట్ చదువులు.... ఇంగ్లీషు ఆలోచనలు.....

తెలుగు మర్చిపోయాననటం పెద్ద హోదాగా ఫీలవుతాడతను. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ , చేస్తూ, బిజీగా వున్నట్లు నటించటం అతని హాబీ. గ్రామాలంటే– ఆ వాతావరణ మంటే, అతనికి అలెర్జీ, దుర్వాసనలు గల గాలి పీల్చందే అతని గుండె నిండదు. శబ్దాలు వినందే నిద్ర పట్టదు. ఎండాకాలమైనా సూటు వేసుకోనిదే స్వేచ్ఛగా వుండదు. వాతావరణ కాలుష్యానికి అలవాటు పడి పోల్యూటే అయిపోయిన జీవి!

అయితే అతని దగ్గర వొక్క గొప్ప లక్షణం వుంది.

తన జీవన విధానం గొప్పదని అతను అడిగినా

అడగక పోయినా అందరికీ చెప్తాడు తను గొప్పవాడినని అతనిలో అతను మనస్ఫూర్తిగా అనుకొంటాడు అవసర మైనప్పుడు పైగా బల్లగుద్ది మరీ చెప్పుకొంటాడు.

సుధాంశు అతనిపై పై ఆకర్షణలకు లొంగి పోయింది.

బొంబాయి, కలకత్తా లాంటి మహానగర్లాల్లో జీవితాలను గురించి అతను వర్ణించి చెప్తుంటే, అతని భార్యగా, తన భవిష్యత్తును పంచరంగుల్లో చూచుకొంది

అతడికి భార్య అయింది

తండ్రి డబ్బుతో అతడితో 'హనీమూన్' ఎంజాయ్ చేసింది.

అంతవరకూ హాయిగానే వుంది

హనీమూన్ అయ్యాక నేరుగా బొంబాయి చేరేరిద్దరూ.

బొంబాయిలో వో కంపెనీలో ఇంజనీర్ వుద్యోగం అతనిది. నెలకి నాలుగు వేల రూపాయల జీతం వస్తుంది

'నా మొగుడికి నాలుగు వేల రూపాయల జీతం తెల్సా? సంవత్సరానిక్కాదు నెలకు. ఆనెలలో ముప్పై రోజులున్నా ముప్పై వొక్క రోజులున్నా." ఇరవై తొమ్మిది , ఇరవై ఎనిమిది రోజులున్నా లెక్కలేదు నాలుగు వేలూ యిస్తారు. తెల్సా?' స్నేహితురాళ్లతో పెళ్ళికి ముందు గొప్పగా చెప్పుకొంది సుధాంశు.

బొంబాయిలో ఆభవనాలు ఆ బస్సులు ఆ కార్లు. ఆ రోడ్లు.

టాక్సీలో కూర్చుని ఆ మహానగరాన్ని, తన గ్రామంతో పోల్చుకొని, తాను యీ నగర వాసి కాబోతున్నందుకు గర్వించింది

'యిదే మన భవనం' టాక్సీదిగి అన్నాడు గురునాధం–గర్వంగా

ఎదురుగ్గా వున్న ఆరంతస్తుల భవనం తనదే నన్నంత గొప్ప విశ్వాసంతో అన్నాడతను ఆక్షణంలో సుధాంశు కూడా ఆ భవనానికి తనే యజమానురాలయినట్లు ఫీలయింది

'లిఫ్ట్' ఎక్కేరు

ఆ లిఫ్ట్ పైకి వెళ్తున్నంత సేపూ తాను స్వర్గలో కానికి వెళ్తున్నట్లు ఫీలయింది ఆమె

'యిది అయిదో అంతస్తు అదుగో– అదే మన అపార్టుమెంటు–'

అపార్టుమెంట్ చిన్నదే కానీ ఆభావన ఆమెకు కలగలేదు మొదట్లో

ఆమె, గ్రామంలో తమ భవంతితో, ఆ అపార్టుమెంట్‌ని పోల్చుకొంది

బెడ్ రూమ్స్ రెండు– డ్రాయింగ్ రూమ్– కిచెన్ . ఎక్కడికక్కడ పేర్చినట్లున్న వస్తువులు. ఫ్లవర్ వాజ్‌లు .. కార్పెట్లు .. టీవీ . టెలిఫోన్ .. ఫ్రిజ్.. సింక్‌లు

అధునాతనంగా వున్న యీ యింట్లో జీవించటం ఎంత అదృష్టం?

కాలికి మట్టి , కావాలన్నా అంటదే!

'డింగ్ డాంగ్ డింగ్ డాంగ్ ..' కాలింగ్ బెల్

శబ్దం విన్పించి ఆలోచన చెదిరింది. ఎలక్ట్రానిక్ గడియారం చూచింది.

యింకా మధ్యాహ్నం పన్నెండు గంటలయినా కాలేదు

మరో అరు గంటలు గడిస్తే కానీ గురునాధం యింటికి రాడు కదా? యిప్పుడు వచ్చిందెవరు?

'డోర్ –ఐ ' లో నుంచి వాకిట్లోకి చూచింది ఎవరో యిద్దరు స్త్రీలు

అమ్మయ్య! ఎన్నాళ్ల కెన్నాళ్లకి తన యింటికి స్త్రీలంటూ వచ్చారు?

అసలు ఆడవాళ్లతో మాట్లాడి ఎన్నాళ్లయిందో?

ఎవరో వాళ్ళు? ఎవరయితేనేం? బహుశా పక్క అపార్ట్మెంటులో వాళ్లో, లేకపోతే గురునాధం సహ వుద్యోగుల భార్యలో అయివుంటారు

ఏ పేరంటానికో పిలవటానికి వచ్చివుంటారు

సుధాంశు గుండె వొక్కక్షణం చెప్పరాని ఆనందంతో నిండి పోయింది.

ఆమెకు చిన్నప్పటి నుంచి గలగల మని స్నేహితురాళ్లతో మాట్లాడే అలవాటు. పేరంటాలకు వెళ్లటం అంటే ఆమెకు పండుగే. అక్కడ వూళ్లో ఆడంగులంతా కలుస్తారు. కబుర్లకు కొరవే వుండదు.

ఏమైనా యిన్నాళ్లకు తన తలుపు తడుతున్న పేరంటాన్ని వదులుకోకూడదు. వెళ్ళాలి. పరిచయాలు చేసుకోవాలి. సర్దాగా మాట్లాడాలి

తలుపు తెరిచిందామె.

'రండి రండి....' ఆమె అలవాటుకొద్దీ తెలుగులో అంది.

వచ్చిన వారిద్దరి మొహాలలో వెంటనే వచ్చిన మార్పు ఆమె కనిపెట్టింది.

'కమిన్ కమిన్.... వెల్కమ్....' ఇంగ్లీషులో అంది.

వారు నాలుగడుగులు వేసి లోపలికొచ్చారు.

'ప్లీజ్ టేక్ యువర్ సీట్. ఐ విల్ బ్రింగ్ సమ్ డ్రింక్స్....' హడావుడి పడిపోతూ అంది సుధాంశు.

'సారీ. ఎక్స్ క్యూజ్ అజ్. నోటయిమ్. యిదిగో రసీదు. మిస్టర్ ఛటోపాధ్యాయ గారు ప్రామిస్ చేసిన చందా యిప్పిస్తే వెళ్తాం. మీదగ్గర కలెక్ట్ చేసుకోమని చెప్పేరు వారు. మేము.....'

మతిపోయింది సుధాంశుకు. హుషారు, వుత్సాహం అనే మంట మీద చల్లని నీళ్ళు కుమ్మరించినట్లయింది.

వాళ్లేదో సంక్షేమ సంఘానికి చెందిన వారు పేరంటానికి పిలవటానికి వచ్చిన వారుకాదు. మిస్టర్ ఛటోపాధ్యాయ యిస్తానన్న విరాళం వసూలు చేసుకోటానికి వచ్చిన వారు.

"మిస్టర్ ఛటోపాధ్యాయ! ఆయనెవరు?"

యిద్దరు స్త్రీలు మొహ మొహాలు చూచుకొన్నారు.

"యిది ఎన్నో ఫ్లోర్?"

"అయిదు."

"దెన్ –సారీ. ఆరో ఫ్లోర్ అనుకొన్నాం. టయిమ్

ఏకాంత సేవ

వేస్ట్..." గునగున నడుచుకొంటూ వెళ్ళిపోయారు.

నీరసంగా కుర్చీలో కూలబడ్డ సుధాంశుకు కొంత సేపటికి కొత్త ఆలోచన వచ్చింది. కాలక్షేపానికి సర్దాగా 'కాలింగ్ బెల్' ఆట ఆడుకొంటే ఏం?

"ఆ భవనంలో అన్ని అపార్ట్మెంట్సవున్నా పక్క అపార్ట్మెంట్ వారితోనే పరిచయం కాలేదు ఆమెకు. నేమ్బోర్డ్స్ చూచి ఫలానా వారిల్లు అనుకోవాల్సిందే. తనకి తానుగా పలకరిద్దామనుకొన్నా ప్రతివారు బిజీనే ఎప్పుడూ.

ఒక్కొక్క యింటికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కి వాళ్లకి కనపడకుండా దాక్కుంటేసరి. వాళ్ల బిజీ ఏమిటో తేలిపోతుంది. ఎవరు పిల్చారో తెలియక వెతుక్కొని ఛస్తారు. వాళ్లలా తికమకపడుతుంటే ఎంత సర్దాగా వుంటుంది?

ఆమె తలుపు తీసుకొని ఎదుటి అపార్ట్మెంట్ సిన్హాగారి కాలింగ్ బెల్ నొక్కి ఛటుక్కున తన యింట్లో కొచ్చి తలుపు వేసుకొని డోర్ ఐ కన్నంలో నుంచి చూడసాగింది.

యిప్పుడు మిసెస్ సిన్హా బయటకు రావాలి. వచ్చి ఏం చేస్తుందో?

కానీ మిసెస్ సిన్హా ఎంతకీ బయటికి రాలేదు.

మళ్ళీ...మళ్ళీ...నాలుగు సార్లు కాలింగ్ బెల్ నొక్కాక ఆమెకు అనుమానం వచ్చింది. బోర్డు చూచింది.

మిస్టర్ అండ్ మిసెస్ సిన్హా 'అవుట్' –

మరి లోపల ఎవరున్నట్లు? వుండి తలుపు తియ్యకుండా ఏం చేస్తున్నట్లు? అలవాటైన గ్రామ పద్ధతిలో ఆమె తలుపుల్ని బాదింది.

తలుపు తెర్చుకొంది. వో నడివయస్సు స్త్రీ– జుత్తు చెదిరిపోయి, జాకెట్ హుక్స్ వూడిపోయి, రొప్పుతూ రోస్తూ...పనిమనిషో ఏంపాడో?

"మిస్టర్ అండ్ మిసెస్ సిన్హా యింట్లో లేరు. బయటికెళ్లేరు" హిందీలో అంది.

"నువ్వెవరు? యిన్నిసార్లు పిలిచినా పలకలేదు. ఏం చేస్తున్నావ్?"

"నిద్ర పోతున్నాను. నేనీ యింట్లో కుక్ ప్లస్ సర్వెంట్ మైడ్ ప్లస్ వాచ్మెన్ ప్లస్..."

"చాల్చాలు. అన్ని ప్లస్లు వద్దు. యింట్లో యింకా ఎవరో వున్నట్లుందే! మైనస్సా? ప్లస్సా? అద్దంలో చూచుకో. నీ మొహం నిద్ర పోయి లేచినట్లున్నదో, మరేం పని చేసినట్లుందో తెలుస్తుంది.

"అబ్బే..యింట్లో ఎవరున్నారు? ఎవరూ లేరు. నేను నిద్ర లేచి వస్తున్నాను. యింతకీ మీరెవరు? మేమ్సాబ్కు ఏం చెప్పమంటారు?"

"నువ్వేం చెప్పనక్కర్లేదు. చెప్పాల్సిందేదో నేనే చెప్తాలే" ఆమె తన అపార్ట్మెంట్లోకి వచ్చి భళ్ళున తలుపు వేసింది.

"మహానగరంలో ఏ యిల్లు చూచినా ఏమున్నది గర్వకారణం? రంకు పురాణాలు. రంకు భాగవతాలేనా?" అనుకొంటూ తలుపు రంధ్రంలో గుండా చూచింది.

ఎవరో వో యాభై ఏళ్ల వ్యక్తి హడావుడిగా సిన్హా యింట్లో నుంచి బయటికి పోతుండటం కన్పించింది.

"ఛీ ఛీ..." అనుకొంటూ ఆమె వెళ్ళి ఫోను ఎత్తి భర్తకు రింగ్ చేసింది. నెంబర్ ఎన్గేజ్డ్ –

"నాన్సెన్స్..." ఆమె కోపంగా అనుకొంది.

కొంత సేపటి క్రితం వరకు ఆమెకు బోర్ కొట్టూ వుంది. యిప్పుడు కోపంగా కూడా వుంది. మనసంతా అసహ్యంతో నిండింది. తనకి ఎవరో వో నరుడి తోడు కావాలి. తన అసహనాన్ని, కోపాన్ని, బోర్ను ఎవరికో చెప్పుకొని కడిగేసుకోవాలి.

ఆమె స్వభావసిద్ధంగా ఎక్స్ట్రోవర్ట్. చిన్నప్పటి నుంచి తోడు వుంటే కాని స్కూలు కెళ్లేదికాదు. అన్నం తినేదికాదు. సినిమాకి వెళ్లేది కాదు.

అలాంటిది బొంబాయి వచ్చాక –

అపార్ట్మెంట్కు బందీ అయిపోయింది. ఏకాంత సేవ ఆరంభమయింది.

రాత్రి వండి ఫ్రిజ్లో దాచిన అన్నం తిని పొద్దున ఎనిమిది గంటలకల్లా కంపెనీకి వెళ్ళిపోతాడు గురునాధం. మళ్ళీ వచ్చేది ఆరు దాటితేనే. వొక్కోసారి పది, పన్నెండు కూడా దాటుతుంది. యింత సేపు ఏం పని చేస్తాడో?

'మా కంపెనీ యిక్కడ వుందనుకొన్నావేంటి? పాతిక మైళ్ల దూరంలో వుంది. వెళ్ళాలి– రావాలి. పైగా నాదేమన్నా గుమాస్తా వుద్యోగం అనుకొన్నావా? ఇంజనీర్ని. వెరీ ఇంపార్టెంట్ పర్సన్ని. తెల్సా?'

"మీ ఇంపార్టెన్స్ మీరు చూచుకొంటే సరిపోతుందా? వొంటరిగా యీ గదిలో నా గతేమిటి?"

"గదా? యిది అపార్ట్మెంట్. ఫర్నిష్డ్ అపార్ట్మెంట్. హాయిగా టీవీ చూడవచ్చు. ఫేన్ వేసుకొని ఫోమ్బెడ్ మీద పడుకోవచ్చు. తినవచ్చు. తాగవచ్చు. నాకు అప్పుడప్పుడూ ఏమనిపిస్తుందో తెల్సా. హాయిగా ఆడపుట్టుక పుట్టినట్లయితే యింట్లో తిని తాగి నిద్రపోయి, యించక్కా పుస్తకాలు చదువుకొంటూ టీవీ చూస్తూ కేసెట్లు వింటూ కాలం గడిపేవాడిని కదా అని?"

యింత చదువుకొన్న యీ వ్యక్తి బుద్ధి యింత వంకరా? యింత హ్రస్వదృష్టా యీతనిది?

క్రమంగా అతడిని గురించి చాలా తెల్సుకొంది.

అపార్ట్మెంట్తో సహా యింట్లో వొక్క వస్తువూ అతని స్వంతం కాదు.

అద్దెకు తీసుకొన్న ఫర్నిష్డ్ అపార్ట్మెంట్ అది. అతని జీతంలో సగం ఆ అపార్ట్మెంటుకే పోతుంది. మిగతా డబ్బులో కొంత స్వంత ఖర్చుకు వుంచుకొంటాడు. మిగతాది తనకిస్తాడు. ఆ యిచ్చిన దానితో తాను యిల్లు గడపాలి.

పాలు ఖరీదు. పెరుగు, నెయ్యి అసలు దొరకనే

దొరకవు.

కూరలు కొనటం వొక సర్కస్

ఒక బకెట్టులో డబ్బు వేసి, ఏమేం కూరలు కావాలో స్లిప్ రాసి పెట్టి బండివాడు వచ్చే సమయానికి క్రిందికి వదలాలి. పుచ్చులో ఎచ్చులో ఏవో వొకటి ఎలాగోలాగు తూచి లిస్టు ప్రకారం బక్కెట్లో కుమ్మరిస్తాడు.

ఆ కూరల్ని వెంకటేశ్వరస్వామి ప్రసాదం కన్నా జాగ్రత్తగా ఫ్రీజ్‌లో దాచుకొని వారం రోజులు వాడుకోటం–

నాలుగు వేల జీతం అనిపేరు. అంతకన్నా తన గ్రామంలో ఎలిమెంటరీ స్కూలు టీచరు బతుకు నయం.

కానీ యీ బ్రతుకునే తెగపొగడుతాడు గురునాధం.

గురునాధానికి ఫస్టు రాదు ఎందులోనూ. అతను సెకండు ప్లేసెను అంగీకరించడు. సెకండ్ ప్లేస్‌లో : వుండి ప్రధమస్థానంలో వున్నట్లు ఫోజుకొట్టి తృప్తిపడటం అతనితత్వం.

కంపెనీలో అతన్ని మించిన ఇంజనీర్లు ఎందరో వున్నారు. వారికి లక్షణంగా కంపెనీయే క్వార్టర్లు యిచ్చింది. వారంతా హాయిగా వుంటారు.

"ఏమిటో! దూరపుకొండలు నునుపు" అనుకొన్నా గుర్నాధం తత్వంతో సరిపెట్టుకోక చేసేదేముంది?

కానీ యీ వొంటరితనం– బోర్.

వీటికి తోడు యీ రంకు భాగోతం వొకటి.

యింత మంది మగాళ్లు యిలా వుంటే తన భర్త వొక్కడే పవిత్రంగా వుంటాడన్న దానికి దాఖలా ఏమిటి?

అయిదో సారి రింగ్ చేస్తే కంపెనీకి కనెక్షన్ అంది "హలో. గుర్నాధంగారిని వొకసారి పిలుస్తారా?"

"సారీ. ఆయన యివాళ శెలవు పెట్టేరు."

శలవు పెట్టేరా? పెట్టి ఎక్కడికెళ్లేరు?

సుధాంశుకు మరింత టెన్షన్ పెరిగింది.

బోర్ తప్పించుకోటానికి మార్గాలు అన్వేషిస్తుంటే యివాళంతా యిలా జరుగుతున్న దేమిటి?

ఆమెకు ఆలోచించ బుద్దేయలేదు. నిల్చో బుద్దేయలేదు.

కిటికీ దగ్గరి కెళ్లి నిల్చుంది.

కచ్చ... కోపం.... అసహనం... అసహ్యం....

భర్త వచ్చిందాకా కాలం గడపటం ఎలా?

ఏదో చెయ్యాలి. కోపం తీర్చుకోవాలి. మనస్సుకు విశ్రాంతి కావాలి.

ఆమెకు క్రింద ఎక్కడో పోయే బిజీ మనుష్యుల మీద కచ్చ పుట్టింది.

ఏమిటో వారి కంత బోడి బిజీ?

అయిదో అంతస్తునుంచి వారిమీదికి రాయి విసిరితే ఎలా వుంటుంది?

అది తగిలిన మనిషి ఏం చేస్తాడు? రీ ఏక్షన్ ఎలా వుంటుంది?

ఆ ఆలోచన ఆమెకు కొత్త వుత్సాహాన్నిచ్చింది.

గబగబా లోపలికెళ్లి ఫ్రిజ్ తెర్చి రెండు టొమేటోలు, వొక బంగాళా దుంప తీసుకొన్నది. బైనాక్యులర్స్ పెట్టుకొని క్రిందికి చూచి టొమేటో క్రిందికి వదిలింది.

అది వెళ్లి వో కారు టాప్ పైన పడింది. అయ్యో.... వో టొమేటో వేస్ట్.

రెండో టొమేటో మోటార్ బైక్ పైన వెళుతున్న అతని నెత్తిన పడింది.

మొద్దు వెధవ . దాన్ని తుడుచుకోనన్నా తుడుచుకోకుండా అలాగే వెళ్లిపోయాడు. యీసారి గురి చూచి పొటేటోను వదిలింది.

అది నెత్తికి తగిలిన వ్యక్తి తల ఎత్తి చూచాడు. అటూ యిటూ చూచాడు. ఎవర్నో ఏదో అడిగేడు. క్షణంపు రభస జరిగింది. పైగా ఆవ్యక్తిది బట్ట బుర్ర

గుడ్ గుడ్... మంచి కాలక్షేపం యిది.

అయితే పొటేటోలు, టొమేటోలు వేస్ట్ చేస్తే చచ్చేచావు. చిన్న చిన్న గులకరాళ్లు సంపాదిస్తే సరి! కానీ రాళ్లు.... ఎలా... ఎక్కడ దొరుకుతాయి?

ఆమె తలుపులేసి ఎలివేటర్‌లో క్రిందికి దిగింది.

* * * * *

కష్టపడి గుప్పెడు గులక రాళ్లు లాంటి రాళ్లు సంపాదించేప్పటికి చీకటి పడింది. అమ్మయ్య! గురునాధం వచ్చివుంటాడు. చిన్నగా వో రోజు గడిచి పోయింది. రేపు యీ రాళ్లను వుపయోగిస్తూ కాలక్షేపం చేయవచ్చు.

కానీ రాళ్లు ఏరుకొంటూ, రాళ్లు విసురుకొంటూ, ఎన్నాళ్లు వొంటరి బ్రతుకు? తనకీ కర్మేమిటి? హాయిగా తన గ్రామంలో తనకు లేనిదేమిటి?

పోనీ గుర్నాధం చేత వుద్యోగాన్ని మానిపించి తమ గ్రామానికి వెళ్లి పోతే? గుర్నాధంతో వో సారి యీ ప్రసక్తి తెస్తే గ్రామాలను గురించి చాలా హీనంగా మాట్లాడేడు. గ్రామాలు రాజకీయంగా ఎంత కలుషిత మయినా, ఆర్థికంగా ఎంత విలువలు దిగజారి పోయినా, ప్రకృతి సిద్ధమైన సహజ సౌందర్యం కలుషితం కాలేదని తెలీదా అతనికి?

'ఏమైనా యికతను యీ బొంబాయిలో వుండలేదు. ఎలాగైనా అతగాడిని వొప్పించాలి. ఆ బోడి వుద్యోగంతో సంపాదించి యిక్కడ సుఖపడుతున్న దేమిటి? యింతకన్నా తక్కువ సంపాదించుకొంటూ ఎక్కువ సుఖంగా బ్రతక వచ్చు–తమవూళ్లో–' ఎలివేటర్ పైకి వెళుతుండగా పదే పదే అనుకొంది. ఫిఫ్త్ ఫ్లోర్‌లో ఆగే సరికి ఆ ఆలోచన బలపడింది.

ఆమె తలుపు తీసి లోపలికి ప్రవేశించి ఎదురుగ్గా కన్పించిన దృశ్యాన్ని చూచి వులిక్కి పడింది.

బెడ్స్ తడిసి వున్నాయి. టెలివిజన్ తడిసి వుంది. యింకా ఎన్నో.....

సీలింగ్ వైపు చూచింది. సీలింగ్ లీక్ అవుతున్నది. పై అపార్టుమెంటులో వారి నీరు అయాచికంగా తమ యింట్లోకి వచ్చింది.

'యిదో న్యూసెన్సా? లంచాలు తిన మరిగిన ఆఫీసరు, కారటం ఆరంభించిన సీలింగ్ వూరు కొంటాయా? సీలింగ్ లీకేజ్‌ని అరికట్టటం ఎలా? ముందు యీ కొంపలో సామాను చెడిపోకుండా సర్దటం ఎలా? సామాను డేమేజ్ అవుతే చెవులు పిండి డబ్బు వసూలు చేస్తాడు యజమాని'

ఆమె మనసు వంకాయలా వుడికి పోతోంది.

రాత్రి పది గంటలు దాటేక వచ్చాడు గురునాధ్

నాలుగు ప్రశ్నలు వేసి అతను అబద్ధాలు



చెప్తున్నాడని గ్రహించింది.

'మీ ధోరణి కూడా యీ మహానగర జీవితం లాగేవుంది. అనవసరపు హంగామా – హడావుడి. బొంకు– రంకు. మీరీరోజు శలవు పెట్టేరు. అయినా యిప్పుడు వచ్చారు. యీ అపార్టు మెంట్‌లో వొంటరిగా నేనెలా బతకాలి? ఆ టీవీలు, ఫోనులు, పుస్తకాలు, రేడియోలు మనిషికి సాటా? మనిషి మాట్లాడుతాడు. మనిషి వింటాడు. అవి వినలేవు. మాట్లాడుతుంటే మనం వింటూ కూర్చోవాలి. నేనిక్కడ వుంటే మూగ దాన్నయిపోవటం ఖాయం. మీరు మరింత పోల్యూట్ కావటం అంతకన్నా ఖాయం యీమాత్రం బతుకు మావూళ్లో బతక్క పోము. రేపే పోదాంపదండి'

' అలాగే పోదాం . పద' అనటం గురునాథం స్వభావానికే విరుద్ధం

అతను తన జీవితాన్ని పొగుడుకొన్నాడు. బొంబాయి లైఫ్‌ను ఆకాశానికి ఎత్తేశాడు.

రెండు చేతులు కలిస్తే చప్పట్లేగా?

వోట్లాడి పోట్లాడి సుధాంశుకు నోరు నొప్పి పుట్టింది. తెగిందాకా లాగేతత్వం కాదామెది.

పక్కమీద వాలబో తుండగా సీలింగ్ లీకేజ్ గుర్తుకొచ్చింది.

యీ దెబ్బతో గురునాథం చిత్తవుతాడు

'మన మధ్య యీ తగాదా ఎందుకండీ. నేనో

ఏకాంత సేవ

పందెం వేస్తాను. అంగీకరిస్తారా?'

'వో. చెప్పు. ఏపందెమైనా నేను గెలవగలను'

'అయితే అటు చూడండి. పై అంతస్తులో వారింట్లో నీరు మన యింట్లోకి ఆ కప్పుకుండా దొంగతనంగా వస్తున్నాయి. యివాళ పరుపు, టీవీ లాంటి వస్తువులు తడిసేయి. రేపు వారు స్నానం చేసిన నీరు మనల్ని తడిపి పావనం చేయవచ్చు. ఆ సీలింగ్.....'

'సీలింగ్ లీక్ అవుతున్నదని బొంబాయి వదలి వెళ్తామా? ఎలుకలున్నాయని యిల్లుకి నిప్పు పెట్టిందిట నీలాంటి పల్లెటూరి యిల్లాలే ఎవ్వతో. ఆ సీలింగ్ కారకుండా వారం రోజుల్లోపల చేయగలను' గొప్పగా , గర్వంగా అన్నాడు గుర్నాధం.

'సరే. వారంలోగా సీలింగ్‌ను మీరు బాగు చేయించ గలిగినట్లవుతే నేను మీ మాట విని యిక్కడే వుండిపోతాను. లేకపోతే మీరు నేను చెప్పిన మాట విని యీ బొంబాయిని వదిలి మన వూరికి రావాలి. యిదీ పందెం. అంగీకరిస్తారా?'

' అంగీకరిస్తాను. గెలుస్తానుకూడా'

' ఆ సంగతి వారం తర్వాత చూచుకొందాం. ముందు రేపు తడిసిన వస్తువుల్ని ఎండబెట్టాలి. సూర్యుడిని ఎక్కడ పట్టుకొంటారో, ఎండను ఎంతకు కొంటారో ఆలోచించండి ముందు.'

యిద్దరూ ఆ రాత్రికి నేల మీదనే పడుకొన్నారు.

తెల్లారే సరికి గుర్నాధం చప్పగా తడిసి వున్నాడు.

వర్షం కురిసినట్లు సీలింగ్‌లో నుంచి జలధార–

'అయ్యో బాబోయ్......' అంటూ సిక్త్ ఫ్లోర్‌కు పరుగెత్తేడు గుర్నాధం.

★ ★ ★ ★ ★

గడువు తీరటానికి యింకొక్క రోజేవుంది.

కానీ 'సీలింగ్ లీక్' సమస్య పరిష్కారం కనుచూపు మెరలో లేదు. సరికదా– అనేక సమస్యల్ని అనేక మందికి తెచ్చిపెట్టింది . జటిలమయి కూర్చుంది

అసలా అపార్టుమెంట్స్ గవర్నమెంటు వారు కట్టేరు. అప్లై చేసుకున్నవారికి నెల వాయిదాల మీద చెల్లించు కొనే పద్ధతి పైన లాట్‌ల సిస్టంలో అల్లాట్ చేసేరు.

అలా ఆ అపార్టుమెంటుకి వచ్చిన వారందరూ ధనవంతులే. వారికి యిళ్ళు అప్పటికే వున్నాయి. ధనాన్ని వస్తు రూపంలో మార్చుకోటానికి యిళ్ళు కొని అద్దెలకిచ్చారు.

యిళ్ళు కొన్నవాళ్ళంతా చేరి ఆ కాంప్లెక్స్ సమస్యల్ని చూడటానికి వొక కమిటీని ఏర్పాటు చేసుకోవాలనుకొన్నారు మొదట్లో. కానీ రాజకీయ

రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి

NATIONAL SALES announce this Sales Promotion Plan to
• popularise their products.

1వ బహుమతి యెజ్డి మోటారు సైకిలు లేదా రు. 13,000 నగదు.
రెండవ బహుమతులు కలర్ టీవి లేదా రు. 9,000 నగదు ఒక్కొక్కటి.
మూడవ బహుమతులు • తగ్గింపు ధర రు. 500/-కు మూడు స్పీడ్‌లుగల మిక్సర్-కమ్-గ్రైండర్లు./ OR TAPE RECORDER
• తగ్గింపుధర రు. 325/-కు రెండు స్పీడ్‌లుగల మిక్సర్-కమ్-గ్రైండర్‌లు.
• తగ్గింపుధర రు. 225/-కు రెండు బ్యాండ్‌ల ట్రాన్సిస్టర్‌లు. OR TWO-IN-ONE AT REDUCED RATE RS. 900/-

ఈ క్రింది మూడు లైనులలో మేము పదకొండునుంచి 19 వరకు అంకెలను, ఎటునుంచి కూడినా మొత్తం నలభైఐదు వచ్చే విధంగా ఉపయోగించాము

పన్నెండు	పదిహేడు	పదహారు
పందొమ్మిది	పదిహేను	పదకొండు
పద్నాలుగు	పదమూడు	పద్దెనిమిది

మీరు చేయవలసినది :. అదే విధంగా మీరు పన్నెండు నుంచి ఇరవై వరకు అంకెలను మూడు లైనులలో ఎటు వైపు నుంచి కూడినా నలభై ఎనిమిది వచ్చే విధంగా ఉపయోగించవచ్చును ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి

మీ ఎంట్రీలను, తెల్లకాగితం పైన, లేదా పోస్ట్ కార్డు పైన ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రం వ్రాసి 15 రోజులలోగా పంపించండి. ఎక్కువ మంది ఎవరిని ఎంపిక చేసుకుంటారో దానిని బట్టి కరెక్టు పరిష్కారాన్ని నిర్ధారిస్తారు. ఆ వారంలో అందిన కరెక్టు ఎంట్రీలు ఆధారంగా ప్రతి వారం తగ్గింపు ధరలకు బహుమతులను యిస్తారు. విజేతలకు పోస్ట్ ద్వారా తెలియబరుస్తారు. జడ్జిల నిర్ణయం తుది నిర్ణయం. అన్ని వివాదాలు ఢిల్లీ న్యాయస్థానాల పరిధికి లోబడి ఉంటాయి.

NATIONAL SALES CORPORATION (TL)
Post Bag No. 9, Patel Nagar, New Delhi-110008

ప్రకృతి–వికృతి

ఎదిగే చెట్టు
చెరువులోని
మొక్కకు
గొడుగేసి
ఎదగనివ్వడు
ఇది ప్రకృతి
పెరిగే మనిషి
అక్కడ ఉన్న
మనిషికి
టోపీ వేసి
ఎదగనివ్వడు
ఇది వికృతి

—సి. వి. సర్వేశ్వర శర్మ

కారణాల వల్ల కమిటీ ఏర్పడింది కాదు. ఎవరిల్లు వారిదే. ఎవరద్దె వారిదే.

యిల్లు లీక్ అయిన మర్నాడే గుర్నాధం ఫేక్టరీకి శలవు పెట్టి చచ్చీచెడీ యింటి యజమానిని పట్టుకొని సమస్యను చెప్పేడు. పై పోర్షన్ యజమాని **ఎవరో** కనుక్కోటానికి ఆయనకు మూడు రోజులు **పట్టింది.**

తీరా చూస్తే ఆ యజమాని యీ యజమానికి **వ్యాపారంలో నూ,** యిటు రాజకీయాలలోనూ బద్ధ **శత్రువే.**

"**నీ సీలింగ్ కారితే** నేనేం చేయను. చేయాల్సిందేదో **నీ ఖర్చుతో నువ్వే** చేసుకో" ఆరో అంతస్తు అయిదో **అంతస్తుతో వుంది.**

"**అదేం కుదరదు.** నువ్వు నీ గ్రౌండ్ ఫ్లోర్‌ను డేమేజ్ **చేయటం** వల్ల నా సీలింగ్ లీక్ అయింది. కనుక ఆ **బాధ్యత నీదే.** పైగా మా యింట్లో పడుతున్నది నీ **యింట్లో నీరే**"

"నా గ్రౌండ్‌ఫ్లోర్‌ను నా యిష్టం వచ్చినట్లు **చేసుకొంటా.** నా నీటిని నా యిష్టం వచ్చినట్లు **వాడుకొంటా.** నీ పెత్తనం ఏమిటి? నీ రాష్ట్రీకం **ఏమిటి?**"

అయిదో అంతస్తులో ఆ సీలింగ్‌ను **ఆరో అంతస్తు వారు** బాగు చేయించాలా? అయిదో **అంతస్తు వారే చేయించుకోవాలా?**

పెద్ద **చర్చావేదిక** అయింది. లాబుక్కులు **తిరగేస్తున్నారంతా.**

అటు వారు– యిటు వీరు కోర్టుకు వెళ్లటానికి సిద్ధపడుతున్నారు.

"**పూర్వం జాయింటు** ఫేమిలీల వ్యవస్థలో **అన్నదమ్ములే** కొట్టుకొన్నారు. యిప్పుడు ఆ **జాయంటు ఫేమిలీ** వ్యవస్థ పోయింది. నగరాల **పుణ్యమా అని జాయింట్** వోనర్‌షిప్‌లు, జాయింట్ నివాసాలు **వచ్చాయి.** ముక్కూమొహం తెలియని **వాళ్ళు కొట్టుకు** చచ్చారంటే చావరూ?"

"చస్తే చచ్చారు. కానీ ఆ లీకేజ్ అలాగే కంటిన్యూ **అయి ఆరో** అంతస్తు అయిదో అంతస్తు మీద **కూలితే** మనమంతా చస్తాం కదా?" క్రింది అంతస్తుల వాళ్లతో సహా భయపడసాగేరు.

పార్టీలు...ప్రభుత్వం...కోర్టులు....లేబర్ యూనియన్ నాయకులు...యీ ఆరు రోజులూ బాగానే కాలక్షేపం అయింది సుధాంశుకు.

లీకేజ్ – దానికి సంబంధించిన సమస్య పెద్దదయ్యే కొద్దీ ఆమెకు ఆనందం పెరగ సాగింది.

"రేపే గడువు దినం. యింకా ఆశ వుందా? వోడిపోతే రేపు సాయంకాలానికే ప్రయాణం" ఆ రాత్రి హెచ్చరించింది సుధాంశు భర్తను.

ఆ రాత్రి గురునాధం నిద్ర పోలేదు.

తెల్లవారక ముందే 'డ్రింగ్ డ్రింగ్' అంటూ కాలింగ్ బెల్ శబ్దం. అతను లేచే లోగానే సుధాంశు వెళ్ళి తలుపు తీసింది.

"నాన్నా – వచ్చావా?" అంటూ తండ్రిని కౌగిలించుకొని ఏడ్చేసింది.

"ఏముయిందమ్మా? అంత అర్జంటుగా రమ్మని టెలిగ్రాం ఎందుకిచ్చావు?"

"మీ అల్లుడు పందెంలో వోడిపోయాడు నాన్నా. మేము యీ సాయంకాలం బొంబాయి వదిలి మీతో వస్తున్నాం. యిక్కడ యిక నేను వుండలేను నాన్నా. యీ మూగనోము నాకు చాతకాదు" అంటూ బాధంతా చెప్పుకొంది బరువును కొంతైనా దించుకొంది.

"ఏమయ్యా అల్లుడు గారూ?" అన్నట్లు అల్లుడి వంక చూచాడు ఆయన.

"మీ అల్లుడు గారు స్వతహాగా మంచివాడే నాన్నా. ఆయన పెరిగిన వాతావరణమే మంచిది కాదు.పోల్యూటెడ్ ఆలోచనలు– వూహలు. నేను కూడా, పుస్తకాల్లో, సినిమాల్లో, నగర జీవితాల్ని చూచి దీపం పురుగులా ఆకర్షింపబడ్డాను, వొక బలహీన క్షణంలో. కానీ యీ భవనాలు...యీ లైట్లు...యీ రణగొణ– యీ వేగం మిధ్యాబింబాలు నాన్నా. యీ బిబాలు ఆకర్షించి ఆరాటపెడ్తాయి మనిషిని. మన గ్రామాల్లో ప్రవృత్తి, మనిషిని, ఆదరించి అనునయిస్తుంది. యిక్కడ పేదవాడికి బ్రతుకు దొరుకుతుంది. ధనవంతుడుకి కృత్రిమ సుఖాలు కొనుక్కోగలడు. కానీ మధ్యతరగతి జీవులకు మిగిలేది– ఆరాటం, అశాంతి మాత్రమే నాన్నా. మనకు దొరికే సహజ సుఖాలు యిక్కడ ఎవరికైనా ఎంతో కష్టపడ్తే కాని లభించవు. మధ్య తరగతి వాళ్ల బ్రతుకు –లీక్ అవుతున్న ఆ సీలింగ్ చందం నాన్నా. వాళ్ల జీవితాలకి పగుళ్లే కాని– అతుకులు, రిపేర్లు వుండవు."

"మధ్యతరగతా? నాలుగు వేలు సంపాదించే నా అల్లుడు...."

నాన్న అమాయకత్వానికి ఏడ్చే వోపిక లేక నవ్వింది సుధాంశు.

"మన వూళ్లో నాలుగు వేలకింకా విలువ వున్నది నాన్నా. యిక్కడ నాలుగు వేలు మన వూళ్లో నాలుగొందలతో సమానం.. ఆ విషయం యిక్కడికొచ్చాక నాకు తెల్సింది. సర్దాగా యీ వూళ్లో రేట్లు చెప్పనా నాన్నా..." అంటూ యింటి అద్దె నుంచి కూరగాయలు దాకా ధరవరల్ని చెప్పింది.

"అయితే యిన్నాళ్లు నాకెందుకు రాయిలేదమ్మా? ఎలా బ్రతకగలిగేరు మీరు?"

"మీ రిచ్చిన నగలున్నాయిగా నాన్నా..." అంటూ బావురుమంది సుధాంశు.

"అల్లుడు యీ సాయంకాలానికే మన ప్రయాణం"

మామగారి ఆర్డర్‌కి తలవంచక తప్పలేదు గురునాధం.

"ఏమండీ. నాన్నగారిని పిలిపించేనని కోపం వచ్చిందా నా మీద?"

రైలు కదిలేక, వెనక్కి వెనక్కి వెళ్తున్న నగరాన్ని చూస్తూ అంది సుధాంశు. పట్టపగలులా ప్రకాశించే నగరం క్రమంగా దూరమయింది. చీకట్లోకి చూస్తూ చాలా సేపు మాట్లాడలేదు గుర్నాధం.

"లేదు సుధా. నువ్వు మంచి పని చేసేవు. చీకటి అందం చీకటిదే. సూర్యుడి అందం సూర్యుడిదే. రెండు అందాలు ఆస్వాదించగలిగితేనే జీవితానికి సాఫల్యత. పగలు రాత్రి కూడా దీపాల వెలుగులోనే బ్రతక వల్సి రావటం ఎంత దురదృష్టకరమో నాకు యిప్పుడు తెల్సి వస్తోంది. చీకట్లో నుంచి వెలుగులోకి తీసికెళ్తున్న నిన్ను చూచి నేను గర్విస్తున్నాను" అంటూ అత నామెను దగ్గరికి తీసుకొన్నాడు.

"అమ్మో! ఏమోననుకొన్నా. మీరూ బరువు డైలాగులు చెప్పగలరే. నన్నడిగితే యిదంతా ఆ అపార్టుమెంటులు కట్టిన కాంట్రాక్టరు గారి చలువ. ఆ లీకేజ్ లేకపోతే బొంబాయి వదలటానికి మీరింత సులభంగా వొప్పుకొనేవారే. నాకు తెలీదూ మీ సంగతి?" అంటూ ఆమె అతడి గుండెల్లోకి వొదిగిపోయింది. "నా మూగనోముకు వుద్వాసన తీరిపోయింది" చెవిలో గుసగుసలాడింది."ఏకాంత సేవ బదులు యిక పతి సేవ చేస్తావా?" అతను గుసగుసలాడేడు.

రైల్లో మిగతా ప్రయాణీకులు తమని చూస్తున్నారన్న స్ఫురణన్నా లేదు– ఆ దంపతులకి. "ఆనందమే అందం –స్వేచ్ఛే ఆనందం! స్వచ్ఛతే పరమానందం –సహజత్వమే బ్రహ్మానందం" అని వారి మనసులు డ్యూయెట్లు పాడుకొన్నాయి. యాంత్రిక నాగరికతా నీకో నమస్కారం. మహానగరమా నీకింక గుడ్‌బై...శలవ్. □